క్లుప్తంగా

చురుగ్గా ఉపాధి హామీ పనులు



పామర్రు: మండలంలోని 25 జీపీలలో చురుగ్గా ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సురేష్ తెలిపారు. మండలంలోని ఐనంపూడిలో జరుగుతున్న చెరువు తవ్వకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 3,362 మంది ఉపాధి కూలీలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిలో ఎలకుర్రు, జమీదగ్గుమిల్లి, కొండిపర్రు, ఐనంపూడి గ్రామాల్లో చెరువు తవ్వకం పనులు చేస్తున్నారన్నారు. మిగిలిన గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

పీహెచ్‌సీ రోడ్డుకు సర్వే



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని పీహెచ్‌సీ రోడ్డుకు అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా పలు ఆక్రమణల కారణంగా డ్రెయినేజీలో మురుగు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోతోంది. రోడ్డుపైనే పలువురు మురుగు నీరు వదులుతుండటంతో పీహెచ్‌సీకి రాకపోకలు సాగించే రోగులు, ఈ రోడ్డులో నివశించే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామస్తులు సమస్యను పంచాయతీ సర్పంచ్ పెనుమత్స రాధిక దృష్టికి తీసుకొచ్చారు. రాధిక చొరవతో మండల ఇన్‌చార్జి సర్వేయర్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో రోడ్డుకు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారు.

క్రీస్తు మార్గం ఆచరణీయం



తోట్లవల్లూరు: ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, శాంతి మార్గం ఆచరణీయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని గురివిందపల్లిలో జరుగుతున్న క్రైస్తవ సభలలో గురువారం రాత్రి ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీస్తు చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని అనిల్‌కుమార్ సూచించారు. పాస్టర్ కాండ్రు ఏసుపాదం ఆధ్వర్యంలో క్రీస్తు విశ్వాసులు అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్, ఉప సర్పంచ్ పోతురాజు నాగ జయరాజు, నాయకులు నడకుదురు రాజేంద్ర, పొత్తూరి రవి, కొడాలి రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి



గుడివాడరూరల్: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మనోహర్ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే గృహంలో కలసి పూలమొక్కను అందజేశారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టాలని కమిషనర్‌కు సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా అందేలా పురపాలక సంఘం పని చేయాలన్నారు. కమిషనర్ స్పందిస్తూ అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ గుడివాడ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పరిశీలన



మండవల్లి: మండవల్లి మొగలి చెరువు వద్ద 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లో-ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఎల్ఎం హరికృష్ణ, భక్తినాథం, పండు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గుడివాడరూరల్: రోజురోజుకీ పెరుగుతున్న ఎండల తీవ్ర కారణంగా గుడివాడ-పోలుకొండ రహదారిపై మండలంలోని లింగవరం బస్టాండ్ ఎదురుగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సామాజిక వేత్త ఎ.రవికిరణ్ అన్నారు. లింగవరం గ్రామానికి చెందిన నేతాజీ నైజం పేరిట శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రహదారి వెంబడి ప్రయాణించే వారికి తాగునీరు అందజేశారు.

మొక్కుబడిగా ధాన్యం కొనుగోళ్లు

- 1,100 ఎకరాల్లో దాళ్వా సాగు
- ముమ్మరంగా ధాన్యం నూర్పిడి పనులు

తోట్లవల్లూరు: ధాన్యం కొనుగోళ్లు మొక్కుబడిగా సాగుతున్నాయా.. రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారుతున్నాయా.. అంటే రైతుల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ధాన్యం కొనుగోలు విషయంలో రొయ్యూరు రైతు సేవా కేంద్రం సిబ్బంది అనుసరిస్తున్న తీరుపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు, వల్లూరుపాలెం, బొడ్డపాడు, చిన పులిపాక గ్రామాల్లో దాళ్వా పంట సాగైంది. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 1,100 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించి పంట ఏపుగా ఎదిగి కోతకు సిద్ధమైంది. దీంతో కొన్ని రోజులుగా యంత్రాలతో ధాన్యం నూర్పిడి పనులను రైతులు నిర్వహిస్తున్నారు. ఎకరానికి 40 బస్తాల వరకు దిగుబడి వస్తోంది.



రొయ్యూరు-కంకిపాడు రహదారిలో ధాన్యం ఆరబెట్టిన రైతులు

రైతు నెత్తిన ఈ-క్రాప్ పిడుగు

రొయ్యూరులో రైతులు యంత్రాలతో ధాన్యం నూర్పిడి చేసి రొయ్యూరు-కంకిపాడు రహదారిలో పెద్ద ఎత్తున ఆరబెట్టారు. ధాన్యం అమ్ముదామని రైతు సేవాకేంద్రాన్ని సంప్రదిస్తే ఈ-క్రాప్ లేదని, రైస్‌మిల్ టార్గెట్ పూర్తయిందని, ఇక కొనుగోలు చేయబోమని సిబ్బంది చెబుతుండటంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. పండించిన పంటకు సకాలంలో ఈ-క్రాప్ చేయకుండా రైతుసేవాకేంద్రం సిబ్బంది ఇలా ఇబ్బంది పెట్టడం తగదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారుల దందా..

ధాన్యం కొనుగోలు విషయంలో రైతు సేవా కేంద్రం కొర్రీలు వేస్తుండటంతో దళారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. 75 కేజీల ధాన్యం బస్తాకు ప్రభుత్వం రూ. 1,725లు ఇస్తుంటే, దళారులు రూ.1,200కు కొనుగోలు చేస్తూ రైతులను అందినకాడికి దోచుకుంటున్నారు. గ్రామంలో సగం మంది రైతులకు ఈ-క్రాప్ లేకపోవటంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఈ-క్రాప్ నిబంధనలు సడలించి తాము పండించిన పంటను పూర్తి స్థాయిలో కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ట్రక్ షీట్ ఇవ్వటం లేదు



10 ఎకరాల్లో నేను దాళ్వా పంటను సాగు చేశాను. ఇటీవల యంత్రాల ద్వారా ధాన్యం నూర్పిడి చేశాను. లారీలో ధాన్యాన్ని లోడ్ చేయించి మిల్లుకు పంపినా ట్రక్ షీట్ (వాహనపత్రం) ఇవ్వలేదు. 24 గంటల తరువాత ట్రక్ షీట్ ఇవ్వటంతో మానసికంగా ఇబ్బంది పడ్డాను.

– లుక్కా నాగరాజు, రైతు, రొయ్యూరు

ఈ-క్రాప్ లేక అవస్థలు



రొయ్యూరు రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు ఈ-క్రాప్ చేయటంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ-క్రాప్ చేయకపోవటంతో ధాన్యం అమ్ముకోవటానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దళారులు అడ్డగోలు రేటుకు అడుగుతున్నారు.

– లుక్కా భరత్, రైతు, రొయ్యూరు

ఎలాంటి ఇబ్బంది లేదు



ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పండించిన పంటను కొనుగోలు చేస్తాం. దావులూరు బాలాజీ రైస్‌మిల్‌కు టార్గెట్ పూర్తి కావటంతో ట్రక్ షీట్ జనరేట్ చేయటంలో జాప్యం జరిగింది.

–జి. నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ క్యాండిల్ ర్యాలీ



కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా కూచిపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు



వల్లూరుపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

కూచిపూడి(మొవ్వ): 'ఉగ్రవాదం నశించాలి.. హిందువుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ శుక్రవారం సాయంత్రం మొవ్వ మండలం కూచిపూడిలోని కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో హిందువులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయం నుంచి పెదపూడిలోని శివాలయం వరకు హిందువులు పెద్ద ఎత్తున జాతీయ పతాకాలతో కొవ్వొతుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో తాతా శేషుబాబు, చిమటా రాఘవేంద్రరావు, సోమయాజుల ఆంజనేయులు, తులసీదాస్, దోనేపూడి శివరామయ్య, రామిశెట్టి రాజీవ్, డాక్టర్ పోలన అశోక్, రాజులపాటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు వ్యతిరేకంగా నిరసన

ముదినేపల్లి రూరల్: ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా ముదినేపల్లిలో ముస్లింలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మసీదులో మసీదు కమిటీ సభ్యులు షేక్ బాజీ, మహ్మద్ షరీఫ్, షేక్ రూరిల్లా, ఇమ్రాన్, సులేమాన్, మహ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

వల్లూరుపాలెంలో..

తోట్లవల్లూరు: కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని వల్లూరుపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఘటనకు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, కార్యదర్శి మక్కిన శివసుబ్రహ్మణ్యం, లంక వెంకటేశ్వరరావు, ఆచంట కోటిబాబు, ఈడే వాసు, యేమినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: కశ్మీర్‌లో టూరిస్టులపై టెర్రరిస్టులు చేసిన దాడిని ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమాయక ప్రజల ప్రాణాలు బలిగొనడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వ విధానమేనన్నారు. ఇలాంటి ఉగ్ర చర్యలు చేపట్టకుండా కేంద్ర బలగాలను పంపి కశ్మీర్‌లో శాంతి నెలకొల్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి, పి. రజిని, ఆర్. కొండ, ఎన్ మురళీ కృష్ణారెడ్డి, యెషయ్య, ఎ. వెంకటేశ్వరరావు, సురేంద్ర, బి. వెంకటేశ్వరరావు, కృష్ణకిషోర్ పాల్గొన్నారు.



ముదినేపల్లిలో ముస్లింల నిరసన



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

పామర్రు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక అధికారిక షివర్ వారి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గుర్తించిన 140 మంది దివ్యాంగులకు సుమారు రూ.33 లక్షల విలువ గల ఉపకరణాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరి పల్లి గణేష్, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అరవిందబాబు, దివ్యాంగుల సంక్షేమ శాఖ జేడీ కామరాజు, ఎంపీడీఓ జ్యోతి పాల్గొన్నారు.



ఉపకరణాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ఉపకరణాలు సద్వినియోగం చేసుకోవాలి

ముదినేపల్లి రూరల్: దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కె నరేష్‌కుమార్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు శుక్రవారం అందజేశారు. జెడ్పీహైస్కూల్ హెచ్ఎం వై.విజయ కుమార్, ఫిజియోథెరపిస్టు కె.సునీత, ఐఈఆర్పీ బి.నీలిమ, సీజీవీజీ భవాని పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అందజేసిన పలు వినతులపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ, నందివాడ మండలాల టీడీపీ అధ్యక్షులు వాసే మురళీ, దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు.

'సత్యం'కు డీఎన్నార్ నివాళులు



కైకలూరు: స్థానిక వెలమపేటలో మృతి చెందిన సానా సత్యంకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శుక్రవారం నివాళులర్పించారు. వెలమపేటకు చెందిన సానా శ్రీనివాసరావు తండ్రి సత్యం శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న డీఎన్నార్ పార్టీ నాయకులతో శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి పరామర్శించి సత్యం మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు శింగంశెట్టి రాము, సమయం రామాంజనేయులు, పంజా నాగు, మడక శ్రీను ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

గుడివాడ టౌన్: పట్టణ ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, అధికారులతో కలిసి పెద ఎరికపాడులోని పంపుల చెరువు వద్ద నీటి నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాపిడ్ ఫిల్లింగ్ విధానం ద్వారా రెండు చెరువులు పూర్తిగా నింపుతున్నామన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు ఏవిధమైన నీటి సమస్య ఏర్పడకుండా పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉండేలా ఏర్పాటు చేశామన్నారు.



నీటిని నింపుతున్న విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

గ్రామ సమస్యలు పరిష్కరిస్తా

కైకలూరు: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామస్తులు పలువురు గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలంటూ వరహాపట్నంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి శుక్రవారం విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



వడాలి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక ట్రావెలర్స్‌బంగ్లాలో శుక్రవారం అందజేశారు. అదే విధంగా నియోజకవర్గంలోని విలేకరులకు పోస్టల్ బీమా చేయించారు.

చెరువులను పూర్తిస్థాయిలో నింపాలి

మండవల్లి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఇరిగేషన్ ఈఈ ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు. మండవల్లిలో మంచినీటి చెరువుకు మోటార్లతో నీరు పెడుతున్న విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్, ఏఈ కిషోర్, డీసీ చైర్మన్ కొండ, సత్తిబాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గుడివాడ మున్సిపల్ కమిషనర్

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మను శుక్రవారం గుడివాడ మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇటీవల మునిసిపల్ కమిషనర్ బదిలీల్లో భాగంగా కాకినాడ కార్పొరేషన్‌లో డెప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో మనోహర్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కమిషనర్ మనోహర్

కమిషనర్‌కు సత్కారం

గుడివాడ టౌన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుడివాడ మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌ను మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రాయపల్లి కృష్ణ, సయ్యద్ గఫార్, ఎస్ అప్పారావు, ఎం. సుధాకర్, సీహెచ్ వేణు, మల్లిక్, శివ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ఉంద్రపూడి(పామర్రు): మండలంలోని ఉంద్రపూడిలో మూడు రోజులపాటు నిర్వహించే గంగానమ్మ జాతరను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. తొలిరోజున గంగానమ్మ తల్లికి 108 జల బిందెలతో అభిషేకం చేశారు. అనంతరం స్థానిక మాలక్ష్మమ్మ తల్లికి పూత పెట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన తెల్లవారుజాము నుంచి అమ్మవారి ఊరేగింపు జరుగుతుందన్నారు. తొలుత గ్రామంలో కట్టడిని చేసి, అనంతరం ఊరేగింపు ప్రారంభిస్తామని తెలిపారు. ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు తమ మొక్కులను తీర్చుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట పోలాక్షి రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు మేకా గోవర్ధనరావు, తోట రాంబాబు, దాసు ఏడుకొండలు, మట్టా శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు, మట్టా నాగమల్లేశ్వరరావు, చీర్ల ఆంజనేయులు, మండపాక దినేష్, తంగెళ్ల రవితేజ పాల్గొన్నారు.



మాలక్ష్మమ్మ తల్లికి పూత పెడుతున్న భక్తులు

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

గుడివాడ టౌన్: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నివారించవచ్చని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ట్విన్సన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక 13వ వార్డు బాపూజీ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. వాతావరణం పొడిగా ఉండేలా చూడటం, దోమలు నిల్వ ఉండటానికి అవకాశాలు లేకుండా చూసే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. మలేరియా వ్యాప్తికి దోమలే కారణమని, వాటిని నివారించి రోగాల బారిన పడకుండా ఉండవచ్చునని అన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ కన్వీనర్ రూప్‌చంద్ జైన్, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ కళాసాగర్, ఆర్గనైజర్ వి. రామారావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యబృందం

పెదయెడ్లగాడి-సిద్ధాంతం రోడ్డుకు మోక్షమెప్పుడో?

మండవల్లి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలు నరకప్రాయంగా ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారాయని విమర్శిస్తున్నారు. మండలంలోని పెదయెడ్లగాడి నుంచి సిద్ధాంతం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి నుంచి జిల్లా కేంద్రమైన ఏలూరు వెళ్లడానికి పలు గ్రామాలవాసులు అల్లాడిపోతున్నారు. ఉనికిలి, రుద్రపాక, నందిగామలంక, పెనుమాకలంక తదితర గ్రామాల ప్రజలు గోతులమయంగా ఉన్న రహదారిపై, రాళ్లు పైకిలేచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే రహదారి మరింత దారుణంగా ఉంటుందని పేర్కొంటున్నారు. గతంలో ఈ రహదారి అభివృద్ధికి ప్రభుత్వం రూ.7.80 కోట్లు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన సిద్ధాంతం-పెదయెడ్లగాడి రోడ్డు

నిధులు వచ్చాక అభివృద్ధి చేస్తాం

ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు వచ్చిన వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపడతాం. రోడ్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– డి.నాని, పీఆర్ ఏఈ

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ఈ రహదారిపై ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అత్యవసర సమయంలో ప్రయాణం చాలా కష్టసాధ్యంగా ఉంటోంది. గ్రామంలోకి అత్యవసరమైన 108 వంటి వాహనాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– బి.ముంగర నాగరాజు, సర్పంచ్ పెనుమాకలంక

భయంభయంగా ప్రయాణం



రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణం భయం భయంగా ఉంటుంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన కలుగుతోంది. రాత్రి వేళల్లో ప్రయాణం చాలా కష్టంగా ఉంటోంది. పెదయెడ్లగాడి సిద్ధాంతం రహదారి అభివృద్ధి చేయాలి

– ఘంటసాల రంగబాబు, ఉప సర్పంచ్, పెనుమాకలంక

పట్టణాభివృద్ధికి కృషి

గుడివాడ టౌన్: పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేకించి శానిటేషన్ సమస్యలు, రోడ్ల మరమ్మతులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి పరస్పర అవగాహనతో కృషి చేయాలన్నారు. పట్టణంలో అనేక సున్నితమైన సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన పూర్తి సహాయ సహకారాలు అందేలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, టౌన్ ప్లానింగ్, అధికారులు పాల్గొన్నారు.